## క్లుప్తంగా

### డ్రెయినేజీ పనులకు భూమిపూజ



**పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం):** మండలంలోని తాటిపాములలో పంచాయతీ నిధులతో 3, 4, 9, 10 వార్డుల్లో మంగళవారం సర్పంచ్ సత్యంయాదవ్, ఎంపీటీసీ పార్వతమ్మ, ఉప సర్పంచ్ కురుమన్నతో కలిసి డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జానకీరాములు, ఆడెం రాములు, మన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సబ్సిడీపై కోళ్ల పంపిణీ



**పాన్‌గల్:** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై రెయిన్‌బో రూస్టర్ జాతి కోడిపిల్లలను మంగళవారం మండల కేంద్రంలోని పశువైద్యశాల ఆవరణలో పంపిణీ చేసినట్లు మండల పశు వైద్యాధికారి డా.శ్యామ్ తెలపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు బుసిరెడ్డిపల్లి, అన్నారం, దావాజిపల్లి గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 25 కోడి పిల్లలు 68 శాతం సబ్సిడీపై అందించామన్నారు.

### చంద్రయ్య మృతదేహానికి ఘన నివాళి



**వనపర్తి క్రైం:** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ.. అంకితభావంతో ప్రజలకు సేవచేసిన సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి చంద్రయ్య మృతిపై పలువురు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం ఆయన నివాసగృహంలో కామ్రేడ్ చంద్రయ్య భౌతికాయానికి కమ్యూనిస్ట్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధువులు సంతాపం ప్రకటించారు. సంతాపం ప్రకటించిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ, జిల్లా కార్యదర్శి నారాయణ, వెంకటేష్ నాయుడు ఉన్నారు.

### కళ్లకు గంతలు కట్టుకొని గణితావదానం



**పాన్‌గల్:** సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం రిటైర్డు ఉపాధ్యాయులు అనంతప్ప ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని గణితావధనం నిర్వహించారు. నల్లబల్లపై వంద పదాలు రాసి ఒక్కసారి వాటిని విని తర్వాత చదివి వినిపించడంతో పాటు మాయ గుణకారం, మాయ కూడికలు, ప్రధాన సంఖ్యలు వరుస క్రమంలో 500 పేర్లు గుర్తించుకోవడం వంటి గణిత కార్యక్రమాలు చేసి విద్యార్థులను అబ్బురపర్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నమ్మ, హెచ్‌ఎం వీరశేఖరచారి, ఎస్‌ఎంసీ చైర్మన్ లింగస్వామి, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కబీర్‌దాస్‌కు సన్మానం



**ఖిల్లాఘనపురం:** మండల పంచాయతీరాజ్ శాఖ ఏఈ నేనావత్ కబీర్‌దాస్‌ను గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా, అర్జున్ నాయక్‌ను కార్యదర్శిగా ఇటీవల సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఖిల్లాఘనపురం ఎంపీపీ కృష్ణానాయక్, సర్పంచ్‌లు పీనానాయక్, రాజునాయక్, నరేష్‌నాయక్, శ్రీనునాయక్, గోపాల్‌నాయక్, బాలాంజనేయులుగౌడ్ ఉప సర్పంచులు పాండునాయక్ ఆధ్వర్యంలో వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

### స్వచ్ఛందంగా రక్తదానం



**వనపర్తి క్రైం:** జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు తన తండ్రి వర్ధంతి సందర్భంగా మంగళవారం రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన ఉమారాణి, కళ్యాణి, శోభారాణి తమ తండ్రి శ్రీనివాసులు వర్ధంతి సందర్భంగా యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ నరేష్, ముక్తార్, రెడ్‌క్రాస్ చైర్మన్ ఖాజాకుతుబ్బుద్దీన్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కమలేశ్వర్‌రావు

**వీపనగండ్ల:** విద్యార్థులు విద్యలో పట్టు సాధించి, ఉన్నతంగా రాణించాలంటే ఉపాధ్యాయులు సబ్జెక్టులను అర్థం చేయించి, సంస్కారం నేర్పితేనే సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఉమ్మడి మండలాల ఎంపీపీలు కమలేశ్వరావు, సోమేశ్వరమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో చిన్నంబావి, వీపనగండ్ల మండలాల టీచర్స్ లర్నింగ్ మెటీరియల్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని వారు ప్రసంగించారు. విద్యార్థులు విద్యలో రాణించాలంటే వారిలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలని, అప్పుడే వారు ఉన్నత చదువుల్లో రాణిస్తారన్నారు. గణితం, సైన్స్, తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో పట్టు సాధించినప్పుడే పోటీ పరీక్షల్లో నెగ్గుకొస్తారని తెలిపారు.

**గురుకుల పాఠశాలతో మౌలిక వసతులు**

మారుమూల గ్రామాలకు సైతం మంచి విద్య అందించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల ఏర్పాటుతో పాటు అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. ఉన్నత విద్యలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయంటే ఉపాధ్యాయుల కృషి ఫలితమేనని వారన్నారు. ఉపాధ్యాయులు ఆధునిక పద్ధతులు, సమాజ పోకడలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. టీఎల్‌ఎం మేళాలో ప్రదర్శించిన పలు అంశాలు విద్యార్థుల బోధన అంశాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు అన్నారు. ఉమ్మడి మండలాల జెడ్పీటీసీలు మాధురి, వెంకట్రామమ్మ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు విద్యలో రాణించి జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, పుష్పలత, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ మౌలాన్‌బీ చిన్నారెడ్డి, కిరణ్‌గౌడ్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జిల్లా స్థాయికి 40 స్టాల్స్ ఎంపిక**

మండల కేంద్రంలో నిర్వహించిన బోధన అభ్యాసన సామగ్రి మేళాలో ఉమ్మడి మండలాల నుంచి అత్యుత్తమంగా ఉన్న 40 స్టాల్స్‌ను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. బోధన అభ్యసన సామగ్రి ప్రదర్శనలో తెలుగు, గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఉమ్మడి మండలాల నుంచి ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఈ మేళాలో ఉపాధ్యాయులు పలు రకాల ప్రదర్శనలు నిర్వహించారు. ఒక్కో మండలం నుంచి 20 చొప్పున స్టాల్స్‌ను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. అత్యుత్తమంగా స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి ప్రశంసా పత్రాలను ఏర్పాటు చేశారు.

### సరస్వతిదేవి విగ్రహా ఆవిష్కరణ



**వీపగనండ్ల:** మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతి విగ్రహాన్ని ప్రజాప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. పాఠశాలల ఆవరణలో సరస్వతి విగ్రహం ఉండడం ఎంతో శుభసూచకమని, నిత్యం సరస్వతి విగ్రహాన్ని పూజిస్తూ విద్యలో రాణించాలని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణయ్య, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రాంచంద్రయ్య, ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరమ్మ, మాజీ రైతు కమిటీ అధ్యక్షుడు బాలస్వామి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మంజుల, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, ఆంజనేయులు, రవి, మౌలాన్‌బీ పాల్గొన్నారు.

## జీపు యాత్ర జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సంఘం జిల్లా నాయకులు

**పాన్‌గల్:** కార్మికుల సంక్షేమ బోర్డు సాధన, ఆర్టీసీ పరిరక్షణ కోసం రవాణా రంగ కార్మికులు నిర్వహిస్తున్న సంఘర్షణ జీపుయాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలకిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని రేమద్దులలో జీపుయాత్ర ప్రచారంపై మాట్లాడారు. జీపు యాత్ర ఖమ్మంలో ఈనెల 3న ప్రారంభమై ఈనెల 11న సంగారెడ్డిలో ముగుస్తుందన్నారు. ఈయాత్ర జిల్లాకు ఈనెల 5వ తేదీన చేరుకుంటుందన్నారు. మోటార్ వాహన చట్టం 2019లో సవరణలు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, పెంచిన ఓవర్ లోడ్ జరిమానాలను తగ్గించాలని, కార్మికులు కోరిన చోట పార్కింగ్‌లు, అడ్డాల స్థలాలు కేటాయించాలని కోరారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మయ్య, బాలకృష్ణయ్య, రాజు, రాజమౌళి, బాలకృష్ణ, లింగస్వామి, దేవయ్య ఉన్నారు.

### అందరికీ రేషన్ బియ్యం అందించాలి

**ఆత్మకూర్:** మండలంలోని వినియోగదారులందరికీ రేషన్ బియ్యం సకాలంలో అందించాలని తహశీల్దార్ సింధూజ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. డీలర్లు సమయపాలన పాటించాలని, స్టాక్‌పట్టికను ఏర్పాటు చేయాలని, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యం, తప్పుడు మార్గాలకు పాల్పడే డీలర్లపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో డీటీ చాణక్య, ఆర్‌ఐలు జయమ్మ, నర్సింహులు, సీనియర్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహాపూజ



అయ్యప్ప కలశ, నగల ఊరేగింపు చేస్తున్న మాలధారులు



ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న గురుస్వామి

**అమరచింత:** పట్టణంలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప ఆలయంలో మంగళవారం నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజ కనుల పండువగా కొనసాగింది. అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో కలశాన్ని ఊరేగించి ఆలయానికి తరలించారు. గురుస్వాములు మాకం నరసింహులు, గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.ఆరు లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కేశం నాగరాజుగౌడ్ అన్నదానం నిర్వహించారు. మహాపూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, ఆలయ కమిటీ సభ్యులు మనోహర్ రాజ్, రమేష్, మేర్వరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల నిధులు కాజేస్తుండ్రు



మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

**అమరచింత:** కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని ప్రకటించుకుంటున్న సీఎం కేసీఆర్ సర్పంచ్‌లకు మంజూరు అయిన నిధులను వారికి తెలియకుండానే కాజేయటంయేమిటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేశం నాగరాజుగౌడ్ అన్నారు. మండల కేంద్రానికి వచ్చిన ఆయన విలేకరులతో మంగళవారం సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈసందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ 15 వ ఆర్థిక సంఘం ద్వారా పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వెంటనే వారి ఖాతాల నుంచి దారి మళ్లించడం శోచనీయమన్నారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్‌సే హాత్ జోడో కార్యక్రమాన్ని 26 నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించని ప్రభుత్వం ఉచితంగా 24 గంటల పాటు కరెంటు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, అరుణ్‌కుమార్, శ్యాం, విష్ణుయాదవ్, గణేష్, తౌఫిక్, హన్మంతు నాయక్, విష్ణు పాల్గొన్నారు.

### విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

**ఖిల్లాఘనపురం:** మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మంగళవారం యూనిఫాం, దుప్పట్లు పంపిణీ చేశారు. పాఠశాలలోని మొత్తం 265 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన రెండు జతల యూనిఫాం, ఉల్లెన్ దుప్పట్లు అందజేశామని పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు.

### పారదర్శకత అవసరం

**వీపనగండ్ల:** అంగన్‌వాడీ టీచర్లు ఆన్‌లైన్ నమోదులో తప్పులు దొర్లకుండా పారదర్శకతను ప్రదర్శించినప్పుడే అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి గుర్తింపు వస్తుందని సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, పోషణ అభియాన్ సలహాదారు కృష్ణవేణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల స్థాయి సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలలోని మహిళలు, గర్భిణులు, కిషోర బాలికలు, బాలింతలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడంలో అంగన్‌వాడీ టీచర్లు కీలకబాధ్యత వహించాలని వారు అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, కృష్ణమ్మ, పారిజాత, మాధవి, సువర్ణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



శ్రీరంగాపురంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

**వనపర్తి టౌన్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆంగ్ల సంవత్సర 2023 నూతన క్యాలెండర్‌ను మంగళవారం కలెక్టరేట్ సమీకృత కార్యాలయంలోని డీఐఈఓ కార్యాలయంలో డీఐఈఓ జాకీర్ హుస్సేన్ ఆవిష్కరించారు.

**వీపనగండ్ల:** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ఎంపీపీ కమలేశ్వర్‌రావు పలువురు ప్రజాప్రతినిధులు, యూటీఎఫ్ నాయకులు యూటీఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు.

**పెబ్బేరు:** పట్టణ కేంద్రంలో ఎమ్మార్సీ కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ సంఘం 2023 సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, నరసింహ, బుసిరెడ్డి, చంద్రయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**పీఆర్టీయూ ఆధ్వర్యంలో..**

**పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం):** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో పీఆర్టీయూ క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్‌రావు, ఎంఈఓ జయరాం, మండల అధ్యక్షుడు దాసరి చిన్నరాము లు, కాంప్లెక్స్ హెచ్‌ఎం కురుమయ్య ఆవిష్కరించారు.

### ఆయిల్‌పాం సాగుతో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆశిరెడ్డి

**అమరచింత:** రైతులు సంప్రదాయ సాగు వదిలి ఆయిల్‌పాం సాగు చేస్తే అధిక లాభాలు సాధించొచ్చని రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు చుక్క ఆశిరెడ్డి అన్నారు. మండలంలోని నందిమళ్లలోని రైతువేదికలో నిర్వహించిన రైతు క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూరాల ఎడమ కాల్వ పరిధిలో సాగునీటి సౌలభ్యం అధికంగా ఉందని, రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాం తోటలను సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగు కోసం ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, బీసీ రైతులకు 90 శాతం సబ్సిడీలతో డ్రిప్ పరికరాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లేష్, సర్పంచ్ సర్వారెడ్డి, లక్ష్మారెడ్డి, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

### మన ఊరు మన బడి పనుల్లో నిర్లక్ష్యం వద్దు



**ఖిల్లాఘనపురం:** జిల్లాలో ఎంపిక చేసిన గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడి పథకంలో చేపట్టిన పాఠశాలల పనులను పూర్తి చేయాలని జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని షాపూర్, ఖిల్లాఘనపురం గ్రామాల్లో ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంఈఓ ఉషారాణితో కలిసి ఆయన పర్యటించారు. నర్సరీలు, క్రీడాప్రాంగణాలు తదితర వాటిని పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి గ్రామంలోని నర్సరీల్లోని అన్ని బెడ్లలో విత్తనాలు నాటి నీళ్లు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, ఏపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలతోనే విద్యార్థుల్లో సృజనాత్మకత



మదనాపురంలో బహుమతి అందుకుంటున్న విద్యార్థి శిరీష

**ఆత్మకూర్:** పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సాంఘీక శాస్త్రం ప్రతిభా పరీక్షలను నిర్వహించారు. రాష్ట్ర సాంఘీక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాసులు, విజయలక్ష్మి, శ్రీనివాస్, శ్వేత, అనిత పాల్గొన్నారు.

**మదనాపురం:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘీకశాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో పోటీ పరీక్ష నిర్వహించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల నుంచి స్కూల్‌కు ముగ్గురు చొప్పున విద్యార్థులు హాజరై, పోటీ పరీక్షలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అజ్జకొల్లులో పదో తరగతి విద్యార్థిని శిరీష మొదటి స్థానం సాధించింది. పోటీలో గెలుపొందిన వారికి హెచ్‌ఎం నిర్మలాదేవి బహుమతి ప్రదానం చేశారు.

**పాన్‌గల్:** సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్టు నిర్వహించినట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పేర్కొన్నారు. మండలంలోని 11 ఉన్నత పాఠశాలల్లో 8 పాఠశాలల నుంచి విద్యార్థులకు పాల్గొన్నారని, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారన్నారు. కార్యక్రమంలో పాన్‌గల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, మాందాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీరామ్, పాన్‌గల్ బాలికల హెచ్‌ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**చిన్నంబావి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సోమేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని ప్రధాన సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా మిషన్ భగీరథ పథకంలో భాగంగా కొప్పునూరు, పెద్దదగడ గ్రామాల్లో కాంట్రాక్టర్లు నామమాత్రంగా పనుల చేయడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఆ పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ సోమేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పలు శాఖల అధికారుల తీరుపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు.

### బాలల హక్కులపై అవగాహన

**పెబ్బేరు:** మండలంలోని కంచిరావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలబాలికల హక్కులపై మంగళవారం చైల్డ్‌లైన్ ఎస్‌ఐ స్వాతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోకిరీలు బాలికలపై ఈవ్‌టీజింగ్ చేస్తే వెంటనే షీం టీమ్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై ఆడపిల్లలు భయపడకుండా వెంటనే పోలీసులకు, డయల్ 100కు చేయాలని, అలాగే సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, ఫేస్‌బుక్, ట్విట్టర్, అకౌంట్ల మోసాలపై విద్యార్థులకు అగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామస్వామి, ఎంపీటీసీ రాధ, ఉప సర్పంచ్ భాస్కర్, అశోక్, శివశంకర్, ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

**వనపర్తి క్రైం:** కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలన్నారు. ధరణి తప్పిదాలను సరిచేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్, కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు, బాల్‌రెడ్డి, వేణుగోపాల్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, సామాజిక హక్కుల కోసం పోరాడుదాం



అమరచింతలో ఉపధ్యాయురాలిని సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

**సాక్షి, నెట్‌వర్క్:** మహిళా లోకంలో చదువు అనే దీపాన్ని వెలిగించిన దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ అన్నారు. మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆమె చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా టీచర్లను సన్మానించారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పద్మకు సావిత్రిబాయి పూలే అవార్డును బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు పద్మ, రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ, ఎంపీపీ ఆవుల శైలజ, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పోతురాజు శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారి వరలక్ష్మి, హెచ్‌ఎంలు గోపాల్, శంకర్‌గౌడ్, కురుమయ్య, బలరాముడు, ఉపాధ్యాయులు ఆకుల వెంకటయ్య, విష్ణువర్దన్, మహేశ్వర్‌రెడ్డి, సురేఖ, అరుణ, రాజేందర్, ఆరీఫ్, సామాజిక కార్యకర్త కమ్మరి గోపి, సాయిలీల, మధులత పాల్గొన్నారు.



వనపర్తిలో..



ఖిల్లాఘనపురంలో..



శ్రీరంగాపూర్ ఉన్నత పాఠశాలలో..

### ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

**మదనాపురం:** మండల కేంద్రం సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సు ఆత్మకూరు నుంచి వనపర్తికి వెళ్తుండగా మండల కేంద్రంలోని కేవీకే సమీపంలోకి రాగానే బస్సు వెనుక టైర్లు బేరింగ్ ఊడి పడింది. డ్రైవర్ జైనూర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నెమ్మదిగా పక్కన నిలిపారు. ఈ సమయంలో బస్సులో 50మంది ప్రయాణికులు ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం ప్రయాణికులను దింపి వేరే బస్సుకు పంపించారు.